

? ? ? ? ? ? ? ? ? ?

# ఏమిటంటే... ఏమి చెప్పను???

! ! ! ! కకుభ ! ! ! !

? ? ? ? ? ? ? ? ? ?

నేను రచయితనని చెప్పడానికి ధైర్యం చాలదు. ఎందుకంటే పత్రిక ముఖం చూచిన కథల సంఖ్య కంటే పత్రికముఖం చూడని కథల సంఖ్య ఎక్కువ. అసలు నా కథలు అచ్చులో వచ్చినవి వేళ్ళమీద లెక్క పెట్టొచ్చు. ఇంకా చెప్పాలంటే వేళ్ళ మీద లెక్కకూడా అనవసరమే! ఇంతకీ నా కథలు రెండే రెండు పత్రిక ముఖం చూచినయి. నా స్నేహితులు మాత్రం 'ఒరే! రచయితా!' అని తప్పితే వేరే విధంగా పిలవరు. అలా వాళ్ళుపిల్చినప్పుడల్లా తప్పని సరిగా సిగ్గుపడతాను. అప్పుడప్పుడూ, వాళ్ళకు తోచినప్పుడు, 'నీ ఫ్యాన్స్‌లో చక్కటి అమ్మాయిలుంటే ఎంత బావుండును? చక్కా షికార్లకి చెక్కేయొచ్చు' అంటుంటారు.

''ఒరే! యిదన్యాయం! నాఅభిమానులతో మీరా షికార్లు చేసేది?!'' కోపంగా అనే వాడిని.

''నోర్మూయ్యరా! నీకు తోడు అభిమానులు. అందులోనూ అమ్మాయిలు'' అంటూ గిట్టిగా నవ్వేవాళ్ళు. చిన్నబుచ్చుకున్న ముఖంలో పుస్తకంలో తల దూర్చేవాడిని.

అలాటిది ఓ ఆదివారం...

అప్పటికి తొమ్మిదిన్నరయిండేమో!

అప్పటికే ఫ్రెండ్సంతా మార్నింగ్ షో పిక్చర్‌కి (కొత్తది) టికెట్స్ దొరుకుతాయేమోనని వెళ్ళారు. నేను మాత్రం 'టిప్'గా డ్రెస్సయి బైటికిరాబోతున్నాను.

సరిగ్గా అప్పుడే గేటు తీసుకుని ఓ అందమైన అమ్మాయి వచ్చింది. నాలుగిళ్ళ లోగిలి మాది. ఎవరి వాటాలోకి వెళ్తుందోనని కుతూహలంగా చూశాను. ఆశ్చర్యం! ఆ అమ్మాయి సరాసరి మా యింటికే వచ్చింది.

నోట మాటరాక అలాగే నిల్చుండిపోయాను.

''మీరే కదూ రచయితలు?!'' నవ్వుతూ అడిగింది.


ఇంకా 'షాక్' నుంచి తేరుకోలేదు నేను. అలాగే నేనూ ఓ రచయితనని, ఆవిడ కేవలం ఓ అభిమాని అనికూడా మర్చిపోయి నిల్చున్నాను.

''మిమ్మల్నిచూడ్డం చాలా సంతోషంగా వుందండి!''

అంత అందమైన అమ్మాయి పనికట్టుకుని, ఏదో ఓ రెండు కథలు పడ్డ నేరానికి యించక్కా వచ్చి అభినందిస్తుంటే ఎవరు మాత్రం సంతోషించరు! నా కళ్ళు ఆ అమ్మాయినే చూస్తున్నా, చెవులు మాత్రం వినడంలేదు. ఊహాలోకంలో అందంగావుండే బోలెడు మంది అమ్మాయిలు నన్ను అభినందించడానికి పోటీపడుతూ వస్తున్నారు. ఒకరు దండలేస్తుంటే, మరొకరు ఆటోగ్రాఫ్ అడిగేవాళ్ళు. షేక్‌హేండ్ యిచ్చేవాళ్ళు, కెమెరా క్లిక్ మనిపించేవాళ్ళు! ఓహ్! ఆ దృశ్యం ఎంత తియ్యగా వుందో!!

''కూర్చోండి! కూర్చోండి!'' ఎప్పుడూ ఎవరికీ చెయ్యనంత మర్యాదచేస్తూ అన్నాను.

ఇంతగా యీ అనామక రచయితని



వెతుకుతూ వచ్చినందుకయినా కాఫీ యివ్వద్దూ! ఆవిడ నక్కడే కూర్చోపెట్టి కాఫీ యిద్దామనే సదుద్దేశ్యంతో, ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి లోపలికెళ్ళాను.

''హయ్యో! రాక రాక నా అభిమాని, అందులోనూ వో అందమైన అమ్మాయి రావడం నా స్నేహితులు చూడలేదే అని చాలా బాధగా వుంది. ఆ సినిమా ఏదో అందకుండా వాళ్ళంతా తిరిగొస్తే బాగుండును. ఎంచక్కా గర్వంగా కాలరెత్తుకోవచ్చు. ఆలోచిస్తూ ఎన్నడూ కడగని కాఫీ కప్పుల్నికూడా కడిగి ఫ్లాస్కులో కాఫీ పోసి తీసుకొచ్చాను.

ఆశ్చర్యం!! కూర్చున్న ఆవిడాలేదు. ఆవిడ ముందున్న టీపాయ్ మీదెట్టిన ట్రాన్సిస్టరూ లేదు.

''ఒరే! ఏఁవిటిరా! అలా నిలబడ్డావ్? ఎవరికా కాఫీ?'' దుమారంలా వచ్చారు మిత్రబృందం.

''అంత 'టిప్'గా డ్రెస్సయి ఆ ఏడుపు ముఖమేంటి?'' చేతిలోని కప్పా లాక్కుని కాఫీ 'సిప్' చేస్తూ అడిగాడు రమేష్.

''ఒరేయ్! ఏఁవయిందిరా?'' రాకేష్ జాలిగా అడిగాడు.

''ఏమిటంటే ఏమి చెప్పను? ఎందుకంటే ఎలా చెప్ప...నూ...! సద్దుమణిగిన యీ వేళ, నేనతి ఘోరంగా మోసపోయిన యీ... వేళ... ఏం చెప్ప...నూ...'' అందమైన బుల్లి ట్రాన్సిస్టర్ గుర్తుకురాగా, వేలు పెట్టి, ఎప్పుడూ బుల్లి ట్రాన్సిస్టర్‌తో కళకళలాడుతుండే, ప్రస్తుతం బోసిపోయిన టీపాయ్‌ని చూపెడూ, దిగాలుగా కూలబడ్డాను.